# లోకం తీరు!

* రచన: శ్రీ తవ్వా రామరాజ్యం *

అంతవరకూ తనకు చేరువనే వున్న రైల్వేస్టేషన్‌కి కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళాడు పరంధామయ్య. గలు గలు ఫ్లాట్‌ఫారంపైకి పోయి బుకింగ్ కౌంటర్ వద్ద టికెట్ కోసం క్యూలో నిలబడ్డాడు. తనకు ముందునున్న అయిదారు వ్యక్తులను తోసుకుంటూ ముందుకుపోయి మద్రాసుకు ఓ థర్డ్ క్లాస్ టిక్కెట్టుతీసుకుని చక్కా జేబులో వేసుకున్నాడు. తీరా బండికోసం ప్లాట్‌ఫారం మీద పచార్లు చేస్తూంటే 'బండి అరగంట లేటని' ఎవరో యిద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్నారు. 'చచ్చానా దేవుడా' అంటూ ఓమూల బెంచీబల్లమీద చతికిలబడ్డాడు పరంధామయ్య. 'ఆఁ! తాజా, జిలేబీ' అంటూ యిద్దరు కుర్రవాళ్ళు కేకవేస్తున్నారు. ఇవేమీ తనకవసరం లేదంటూ ఆలోచనల్లో మునిగి పోయాడు.

మద్రాసు పోయే మెయిల్ రానేవచ్చింది. గబగబ పరుగెత్తి ఓ కంపార్ట్‌మెంట్‌లో జొరబడ్డాడు. ఇంతలో గార్డు పచ్చ జెండా చూపించాడు. ఇంతమంది జనాన్ని మొయ్యలేను మొర్రో అంటూ మెయిల్ బరువుగా కదిలింది. కంపార్ట్‌మెంట్‌లో ఎక్కడా ఖాళీలేక ఒక వూస పట్టుకుని నిలబడ్డాడు పరంధామయ్య. తనకు ముందునున్న సీట్లో ఎవరో యిద్దరు అరవంవాళ్ళు మాట్లాడుకుంటున్నారు. మెయిల్ ధన్ ధన్ మంటూ వేగంగా పరుగెడుతున్నది. ప్రక్కలనున్న చెట్లన్నీ వెనక్కు పరుగెడుతున్నవి. పరంధామయ్య అటు యిటూ చూసి ఇంతకీ మెయిల్ పరుగెడుతుందా, చెట్లు పరుగెడుతున్నాయా, అని ఆలోచనల్లో పడిపోయాడు. సడన్‌గా మెయిల్ ఆగిపోయింది. పరంధామయ్య ఆలోచనలకు అంతరాయం కలిగింది. ఏదో స్టేషన్ వచ్చిందనుకుని కిటికీ దగ్గరికివచ్చి చూచాడు, ఏదీ ప్లాట్‌ఫారం కన్పించలేదు. కాని చాలామంది దిగిపోతున్నారు. విశేషమేమిటని అడగ్గా, ఎవరో చైన్ లాగేరట. అందుచేత డ్రయివరు సడన్‌గా బ్రేకువేసాడు. ప్రమాదం జరిగిందేమో అంటే అదేమీ లేదన్నారు. మరింతమందీ దిగిపోతున్నారెందుకా అంటే దిగిపోయిన ఒక పెద్ద మనిషి చెప్పాడు 'అనకాపల్లి స్టేషన్ యింకా ఫర్లాంగు దూరంవుంది. ఈరోజు అనకాపల్లిలో నూకాలమ్మ జాతర గొప్పగా జరుగుతుంది. వీరంతా టిక్కెట్ లేకుండా ప్రయాణం చేస్తున్నారు. స్టేషన్లో దిగితే టిక్కెట్ కలెక్టర్ పట్టుకుంటాడని వారలా తప్పుకుంటున్నారు' అన్నాడు. 'ఇదేంట్రా బాబూ! తల్లికి సీరియస్‌గా వుందని అర్జంటుగా పోవాలనుకుంటే మధ్యలో ఈ ఆటంకం వచ్చిందరా' అంటూ రైల్వేవారిని తిట్టుకున్నాడు. అరగంటయింది కాని బండి యింకా కదల్లేదు. తనలాగే ఒక అరవాయనకూడా బండి ఆగినందుకు ఏవోవో తిట్టుకుంటున్నాడు. వారితో యింకో అయిదుగురు వాదనకు దిగారు. ఇలా కాదంటూ వారంతా డ్రయివరు దగ్గరకు వెళ్ళి ఘెరావ్ చేసారు. బండి కదిలింది. ముందరికన్న వేగంగా పోతుంది. బండి. 'మధ్యలో టైమ్ వేస్ట్ అయిందనేమో యింత జోరుగా పోతుంది' అన్నాడో కాయన. 'ఆఁ! ఏడ్చిందిలే, వెధవ బళ్లు! ఒక్కటీకూడా సరిగ్గా వేళకు రావడం పోవడం వుండదు కదా' అంటూ తిట్టుకున్నాడు వేరొకాయన. ఇవేమీ తనను కాదంటూ మెయిల్ యింకా జోరుగా పోతుంది. ఆగవలసినచోట్ల ఆగి చెట్లను వెనక్కు త్రోసుకుంటూ తిరిగి మద్రాసు స్టేషన్లో ఆగింది మెయిలు. పరంధామయ్య తనతో తెచ్చుకున్న ఒక సంచితో దిగబోతూంటే మొఖం తిరిగి ఫ్లాట్‌ఫారం ప్రక్కని పడిపోయాడు. ఎవరో సోడా తెచ్చి మొఖానికి కొట్టి కొంత గొంతుకలో పోసారు. మెల్లగా తేరుకుని అటు యిటు చూశాడు తన సంచికోసం. కానిఎక్కడా కన్పించలేదు దూరపు ప్రయాణం చేసాడేమో బాగా అలసి పోయాడు. అందులోను థర్డ్‌క్లాస్ కంపార్టుమెంట్. వూపరాడనివ్వదు. నరకం అంటే యిదేనేమో అనుకుంటూ చిన్నప్పుడు తనమేష్టారు ఒరేయ్, నరకం ఎక్కడుంటుందిరా అంటే తనకు తెలియదన్నాడు. 'ఇంకెక్కడా! మనరైలు బళ్ళు లేవూ! ముఖ్యంగా థర్డ్‌క్లాస్ కంపార్ట్‌మెంట్స్‌ల్లో

నరకం కావాలంటే దొరుకుతుంది' అన్న ఆయనమాటలు తలుచుకుని చిన్నగా నవ్వుకున్నాడు. టిక్కెట్ టి. సి. మొఖానికొట్టేసి స్టేషన్ బైటకొచ్చాడు.

'బాబూ! రిక్షా కావాలనుకుంటాను' ఎవరో రిక్షావాడడిగాడు.

'ఇంకా అనుకోవడమేమిటయ్యా! ఎముక విరిగి నడవలేక చస్తూంటేనూ' అంటూ రిక్షాలో కూర్చుని 'పద పోనీయ్' అన్నాడు.

'ఎక్కడకు బాబూ?'

'నా కాట్లోకి'

'అయ్యా! ఎముక విరిగినంత పనికి కాట్లోకి పోవాలా? తిన్నగా ఏట్లోకి పోతే చల్లగా వుంటుంది' అన్నాడు.

'ఏడ్చావ్ లే! తిన్నగా సౌకార్ పేటకు పోనీయ్' అన్నాడు పరంధామయ్య.

రిక్షావాడు సిగరేట్ ముట్టించి జోరుగా త్రొక్కుకుంటూ పోతున్నాడు. ప్రక్కలనుండి చల్లగాలివీస్తూంది, పరంధామయ్య ముఖానికి పట్టిన చెమటంతా బాగా ఆరిపోయింది. రైలు కంపార్ట్ మెంట్ కన్నా రిక్షాయే హాయిగా వుందనిపించింది తనకు. రిక్షావాడు ఏదో పాట మొదలెట్టాడు. దానితో పరంధామయ్య మరీ వుత్సాహంగా వున్నాడు కొన్ని నిముషాలక్రితం నరకం అనుభవించిన తను యిప్పుడు స్వర్గం అనుభవిస్తున్నాడు. రిక్షావాడు మధ్య మధ్య బెల్ కొట్టుకుంటూ మరోపాట ప్రారంభించాడు.

'ఇదుగో అబ్బాయ్! చాలా జోరుగా పోనిస్తున్నావ్! ఎన్నాళ్లబట్టి త్రొక్కుతున్నావు?' పరంధామయ్య ప్రారంభించాడు.

'అయిదేళ్ళనుండి'

'అనుభవజ్ఞుడివ్!'

'ఏమిటో బాబూ! ఈ పని చెయ్యడానికి చాలా సిగ్గుగా నుంది'

'ఏం? ఎందుకని? కష్టపడి పనిచేసుకోవట మన విధి కాదా?'

'అదికాదు బాబయ్యా! నేనూ మీలాంటి చదువుకున్న వాణ్ణే-అందుచేత ఈ పని చెయ్యడానికి చాలా సిగ్గేస్తుంది.'

'అలాగా! ఏం చదివావ్?'

'పి. యు, సి పాసయ్యాను బాబయ్యా'

'మరి ఉద్యోగానికి ప్రయత్నంచేయలేక పోయావా?'

'చేస్తూనే వున్నానండీ! ఈ అయిదేళ్లనుండి ఉద్యోగం కోసం వెళ్ళనివూరు, అడగని చోటులేదు. ఏ ఆఫీసులో చూసినా నేను పెట్టుకున్న అప్లికేషన్లు అవీ కనపడ్తాయి. కాని మాలాంటి పేదవాళ్ళను కనికరించి ఉద్యోగమిచ్చే మహానుభావుడు లేడు. కూడు గుడ్డాలేక చచ్చిపోతున్నా మాలాంటి వాడిపై జాలి, కనికరం వుండదు ఆ మహానుభావులకి. అంతా లంచాల మయం. తను సంపాదిస్తున్న జీతపురాళ్ళుగాక ఆదనంగా సంపాదించేది అదే లంచం. ఎదుటివాడెలా పోతే మనకేం అనే కిరాతక స్వార్ధజీవులువారు. వారినేంచేసినా పాపంలేదు' అంటూ వూగిపోయాడు రిక్షావాడు.

'ఇదిగో! అబ్బాయ్! అలా ఉద్రేకపడకు. ఎవరి కర్మ వారిది. వారినలా నిందిస్తే ఏం లాంభం? వారు కూడా ఉద్యోగం చేస్తున్నా రన్నమాటేగాని గవర్నమెంట్ వారిచ్చే జీతాలు చాలక చాలా యిబ్బందులకు గురై గత్యంతరం లేక చివరకు లంచాలు తీసుకుంటున్నారు ప్రభుత్వానికి వీరు చేస్తున్న పని తెలియదా అంటె-తెల్సు. అయినా వారేం చేస్తారు? పట్టుబడితే అరెస్ట్ చేస్తారు. లేకపోతే లేదు. అయినా వారెక్కడ ఎప్పుడు లంచం తీసుకుంటున్నారో ప్రభుత్వానికేం తెల్సు? ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికీ తెలియదు కదా?'

'అయితే నేనింతవరకు కష్టపడి చదివి పాసయినందుకు నాకు దక్కిఫలిత మిదేనా? నిరుద్యోగిగా వుండి జీవితాంతం ఈ రిక్షా తొక్కి జీవించవలసిందేనా? నాతల్లి నామీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. మా నాన్న ఎప్పుడో పోయారు. ఉన్నది యిద్దరు చెల్లెల్లు, నేను. మా అమ్మా, మా నాన్న మిగిల్చిపోయిన అయిదెకరాలభూమిని అమ్మి నన్ను చదివించింది. ఇక తన తాళిబొట్టు కరిగించి ఇంతవరకు నన్నూ, మా యిద్దరు చెల్లెల్నీ పోషిస్తూవచ్చింది. ఇప్పుడామె ఆరోగ్యం బాగులేదు. ఆమె ఆశలన్నీ నా మీదే వున్నవి. ఆమె ఋణం ఎలా తీర్చుకుంటానో...'

'అబ్బాయ్, బాధపడకు, నేను నీకు ఉద్యోగం యిప్పిస్తాను'

'మీరా? నాకా?'

'అవును! మా బావమరిది యిక్కడే కలెక్టరాఫీసులో

పసిగట్టేస్తున్నాడు. వాడితో చెప్పి ఉద్యోగం యిప్పిస్తాను.'

రిక్షావాడి ముఖం వికసించింది. ఆనందంతో బెల్ కొట్టుకుంటూ రిక్షాను యింకా జోరుగా పోనిస్తున్నాడు. మధ్యలో 'ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నారు. మీ ఋణం ఎలా తీర్చుకుంటానో . ' అన్నాడు.

'తర్వాత పొగుడుదువుకాని, ముందు నాదారిచూడు' అన్నాడు పరంధామయ్య.

'సౌకార్ పేట రానేవచ్చింది. మీ ఇంటికిదిగబెట్టడం నాదేకదా బాధ్యత. ఒక చిన్న విషయం!'

'అంత ముఖ్యమా?'

.అవును'

'అయితే అడుగు!'

'ఈ చరాచర ప్రపంచంలో బ్రతుకు శాశ్వతం; భోగభాగ్యాలు అశాశ్వతం. అటువంటప్పుడు ఈ భారతావనిలో వినోద విహారాలంటూ క్లబ్‌లు, జూలూ స్థాపించి వాటికి ఎంతో ధనవ్యయం చేస్తున్న ఈ పాలకవర్గం దానితో నిరుద్యోగులకు బ్రతుకు తెరువు కల్పించకూడదా? ఏమంటారూ?'

'అవును బాబూ! నీ వన్నట్టు రైటే. కాని మనలాంటి పేదవారిపై గౌరవముంటేగా మన సూచనలు పాటించటానికి. దేశంలో ఏ పని చేయాలన్నా తమ అధికారం చెలాయింపు. అంతే కాని ఈ ప్రభుత్వానికి ప్రజాభిప్రాయం అవసరంలేదు. అందరూ పదవులకోసం ప్రాకులాడేవారే. స్వాతంత్ర్యంవచ్చి యిన్నేళ్ళయింది. కాని ఓటిచ్చి ఎన్నుకునే యీ మానవుడికి స్వాతంత్ర్యం లేకుండా పోయింది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తుంది ప్రభుత్వం.'


'శ్రీ బాలసుబ్రహ్మణ్యం'

= పంపులు - మోటార్లు =

శ్రేష్ఠమైన లోహాలతో, పనితనంలో అనుభవంగల నిపుణులచే తయారుచేస్తున్నాము.

: విశేషాంశాలు ;

* స్వల్ప విద్యుచ్ఛక్తితో అధికంగా మంచి నీళ్ళు.
* ఎక్కువకాలం మన్నికకు నమ్మకమైనవి.
* నిశ్శబ్దంగా పరుగు.
* శ్రేష్టమైన తయారి.
* ఖర్చులో తక్కువ.



తయారుచేయువారు :—

బాలసుబ్రహ్మణ్య ఫౌండరీ

పటేల్ రోడ్ (Phone No 24313) కోయంబత్తూరు

ఆంధ్రప్రదేశ్ ఏజెంట్లు : —

అసోసియేటెడ్ ట్రేడర్స్ (దక్షిణ) నెం :- 8570/2 రాష్ట్రపతి రోడ్,

సికింద్రాబాద్ (ఎ. పి.)

'అవును బాబయ్యా! అలాగే అనిపిస్తుంది'

'చూడు బాబు! ఎక్కడే పనిచేసినా న్యాయంకావా అంటారు పెద్దలు. అది రైటే, కాదనను. కాని యిలా నిస్వార్థంతో నీతికి నిజాయితీకి నిలబడే యీ మానవునికి కొన్నిదుష్టశక్తులు ఎదురొస్తున్నవి. ఇలా అయితే ఆ మానవుడు భావితరంలో పురోగమించే దెట్లు?'

'ఈ రోజుల్లో నిస్వార్థంతో జీవించే వారెవరున్నారు బాబయ్యా! అంతా స్వార్థమేగా!'

'అలా అను ఒప్పుకుంటాను. కాని ఒకప్పుడుండేవారు. తమ నీతికీ నిజాయితీకీ రక్షణ లేకపోవటమే వారుకూడా స్వార్థపరులయారు.'

'ఏమిటో బాబయ్యా! ఇది వింటుంటే యీ జీవితంపై విరక్తి కలుగుతుంది'

'అలా అనకు బాబూ! న్యాయానికి తావులేని ఈ ప్రదేశం విడిచి దూరంగా వెళ్ళిపోతేనే మంచిది. కష్టా అన్నది ప్రతీవాడికీ వస్తాయి. ఎన్ని కష్టాలొచ్చినా తీర్చుకోవాలి. తరువాత సుఖమనేది ఖాయం. ఒక కొండపైకి పోవాలంటే ఒక్కొక్క మెట్టు ఎక్కితేనేగాని పైకి పోలేం కదా. కష్టాలుకూడా అలాంటివే. ఇక ఆ కొండ పైనుండి క్రిందికి రావాలంటే ఒక్క దూకు చాలు. సుఖం కూడా యిలాంటిదే, ఒకరు కష్టపడకుండానే సుఖం అనుభవిస్తున్నారంటే అది వారి రాత. 'బ్రహ్మదేవుడు నీ ముఖాన ఎంత డబ్బువ్రాసి పడేశాడో అది శ్మశానంలో వున్నా లభిస్తుంది. అంతకన్నా ఎక్కువ కోరి మేరుపర్వతంమీద కూర్చున్నా నీకు లభించదు. కాబట్టి ధైర్యవంతుడవై డబ్బున్నవారి దయాధర్మ భిక్షకోసం దీనాలాపాలు మాని సముద్రంలోనుంచైనా తనకు పట్టి నన్ని నీళ్ళే తెచ్చుకోగలము కాని అంతకు మించి ఎలాగూ లభించవుగదా!' అన్న భర్తృహరి మాటలు జ్ఞాపకం వుంచుకోవాలి. తెలిసిందా?'

'తెలిసింది బాబయ్యా!'

'ఇదిగో సాకార్‌పేట వచ్చేసింది. ఎదురుగా కన్పిస్తున్న ఎలక్ట్రిక్ స్థంభం ప్రక్కదే మా ఇల్లు. అక్కడే ఆపు చెయ్యి'

'అలాగేనండీ!' అంటూ రిక్షావాడు యింకొంచెం దూరంపోనిచ్చి ఒక పెద్దమేడవద్ద ఆపాడు. పరంధామయ్య దిగిపోయి రిక్షావాడికి డబ్బులివ్వబోతూ 'ఇదిగో నీపేరేమిటన్నావ్?' అన్నాడు.

'రంగా రావండీ!'

'ఇదిగో రంగారావూ! ఇప్పుడు నా తల్లికి సీరియస్‌గా వుంది. ఒక వారం రోజుల తరువాతవస్తే దూ బావమరిదితో చెప్పి నిన్ను ఉద్యోగంలో వేయిస్తాను.'

'అలాగే బాబయ్యా!' అంటూ రిక్షారంగ వెళ్ళిపోయాడు.

ఆ రోజు గడిచిపోయింది. రెండవ మూడవరోజు గడిచిపోయింది. రిక్షారంగ ఏదో ఆలోచించాడు. ఆయన తల్లికి సీరియస్‌గా వుందన్నారు, బాబుగారికి మనతో పని వుండి వుంటుంది. అమ్మగారిని ఆసుపత్రికి తీసుకు వెళ్ళడానికి రిక్షా కావాలి కదా, అని అనుకుంటూ తిన్నగా ఆయన యింటికి వెళ్ళాడు రిక్షా తొక్కుకుంటూ. తీరా దగ్గరకు వచ్చేసరికి ఆ ఇంటికి కప్పతాళాలు వేసి వున్నాయి. రిక్షారంగ ఆశ్చర్యపడ్డాడు. 'ఒకవేళ అమ్మగార్ని ఆసుపత్రికి తీసుకు వెళ్ళారేమో' అనుకుంటూ ఆలోచనల్లో పడ్డాడు. ఇంతలో ప్రక్కింటాయన బైటకు వచ్చి 'ఏం కావాలి?' అని అడిగాడు.

'ఈ ప్రక్కింటి వారెక్కడి కెళ్ళారండి!' అని అడిగాడు రిక్షారంగ.

'వారెప్పుడో ఈ యిల్లుకాలీ చేసిపోయారు. తల్లికి జబ్బుగా వుందంటే నిన్నగాక మొన్ననుకుంటాను ఆవిడ కొడుకు వచ్చాడు. ఆ రోజల్లా యిక్కడే వున్నారు వారు. మర్నాడు చూద్దునుగదా, ఎవ్వరూలేరు; ఒక్క సామానుకూడా లేదు. పైగా ఒక ఏడాది ఇంటి అద్దె బకాయి వున్నాడు. అది యివ్వకుండా, చెప్ప చెయ్యకుండా, జారుకున్నారు.'

రిక్షా రంగ నవ్వుకుంటూ బండిని వెనక్కు మళ్లించాడు. 'నాకు అన్ని నీతులు చెప్పిన మహానుభావుడు, నాకు ఉద్యోగం యిప్పిస్తానన్న ఆ పెద్దమనిషి చెప్పా చెయ్యకుండా వెళిపోయాడా? ఆయన అమ్మగారికోసం తను సానుభూతితో రిక్షా తీసుకువస్తే తనపై ఆయనకు సానుభూతి లేకపోయిందే! ఏమిటో ఈ మనుషులు... లోకం తీరు!' అంటూ మళ్లీ యింకోసారి నవ్వుకుని గాలి కోసం వెళ్ళిపోయాడు రిక్షా రంగారావు.

